(మినీకథ)

# ముందుకు మూడడుగులు

శక సంవత్సరం 1900, ఆశ్వయుజ మాసం పాడ్యమి ఉదయం 10ఘడియల 20 విఘడియలు, అవంతీపుర చక్రవర్తి ఆస్థానం, ప్రదీప చక్రవర్తి సభ తీర్చాడు.

"ముఖ్య అమాత్యా మన ప్రజలను పట్టి పీడించుతున్న నిరుద్యోగ సమస్యను ఈనాటి సభలో పరిష్కరించవలెనని మా ఆన, వెంటనే పరిష్కారము కనుగొనుడు"

ముఖ్య అమాత్యుడు అవాక్కయ్యాడు ఎన్నో దశాబ్దాలుగా కొరకరాని కొయ్యలా ఉన్న ఈ జటిల సమస్యను ఈనాటి సభలో త్రుటి కాలంలో పరిష్కరించడం ఎలా ఆలోచనతో తల గోక్కున్నాడు ముఖ్య అమాత్యుడు.

"వెంటనే సమస్యను పరిష్కరించు మార్గము చెప్పవలె లేనిచో నీ తల తీయించి .."

తక్కున లేచాడు అమాత్యుడు తల ఎగిరిపోతుందనిపించగానే పరిష్కారం పరిగెత్తుకుంటూ వచ్చింది

"ఏమి ఈ సమస్యకు పరిష్కార మార్గమే లేదా " గర్జించాడు ప్రదీప చక్రవర్తి

"ఉన్నది ప్రభూ. మన ఆస్థానములో వయోవృద్ధులు చాలా మంది ఉన్నారు వారిచే త్వరగా పదవీ విరమణ చేయించిన కొందరు యువతీ యువకులకు ఉద్యోగముల నీయవచ్చును"

"భళా, భలే పరిష్కారము . "

ప్రదీప చక్రవర్తి మీసాలు దువ్వాడు

"అయిన పదవీ విరమణ వయసు నెంతవరకు తగ్గించెదము" అడిగాడు

"ప్రస్తుతము అరువది సంవత్సరము లున్నది దానిని యాభై అయిదు చేసిన నాలుగు వేల ఉద్యోగములు ఖాళీ యగును"

"మన సామ్రాజ్యములో నిరుద్యోగు లెందరు?"

"నాలుగు లక్షలు ప్రభూ"

"అయ్యారే అంతమంది ఉన్నారా"

"ఉన్నారు ప్రభూ"

"పోనీ పదవీ విరమణ వయసును యాభైకి తగ్గించిన ఎన్ని ఉద్యోగ

వి. మోహన్ కుమార్

ములు ఖాళీ యగును?"

"ఇరువదివేల ఉద్యోగములు ఖాళీ యగును"

"వహ్వా దీనిని నలభైకి తగ్గించిన?"

"నలబది వేల అయిదు వందలు ఖాళీ యగును"

"కట కటా, దీనిని ముప్పదికి తగ్గించిన?"

"లక్ష ఇరవై వేల ఉద్యోగములు ఖాళీ యగును".

"భళారే భళా ...సమస్యకు పరిష్కారము దగ్గరగుచున్నది. పదవీ విరమణ వయసు ఇరవైకి తగ్గించిన? .." చక్రవర్తి చంకలెగరేసాడు.

"మొత్తం అన్ని ఉద్యోగములు ఖాళీ యగును"

"అమాత్యా నాకు సంఖ్యలో చెప్పుము"

"రెండులక్షల ఇరవై వేలు ప్రభూ"

చక్రవర్తి భృకుటి ముడిపడింది

"అన్ని ఉద్యోగములు ఖాళీచేయించిన ఈ సమస్య పరిష్కారము కాదా" ఓ క్షణం ఆలోచిచాడు.

"సరె అమాత్యా ముందు చర్యగా పదవీ విరమణ వయసు ఇరవైకి తగ్గించుడు. రెండులక్షల అరవై వేల మందికి ముందు ఉపాధి కల్పించుడు. మిగిలిన వారి సంగతి తర్వాత చూచెదము ఇది నా శాసనము."

అమాత్యుడు తాళపత్రం మీద చక్రవర్తి ఆజ్ఞను రాసుకున్నాడు. అలా రాస్తూండగా చటుక్కున ఓ అనుమానం వచ్చింది.

"ప్రభూ మన రాజ్యంలో పదవి నధిష్ఠించటానికి కావలసిన కనీస వయసు ఇరవై ఒక్క సంవత్సరాలు ఈ శాసనమును అమలు పరచిన ప్రభుత్వోద్యోగము లన్నియు ఖాళీ యగును. కాని మన యువతీయువకులు పదవీ స్వీకారము కావించక మునుపే పదవీ విరమణ చేయవలసియుండును. కావున నిరుద్యోగులు. నిరుద్యోగులు గానే ఉందురు".

"ఓహ్, జగజ్జననీ, ఏమి విపత్కర పరిస్థితి వచ్చినది. దీనికి పరిష్కారమే లేదా, ఆచార్యవర్యా శెలవిందు" చక్రవర్తి

కులగురువు శుక్రాచార్యుల వైపు తిరిగారు

"పరిష్కారము ఉన్నది నాయనా కాని ఇది కాదు" అన్నారు ఆచార్యుల వారు

"అమాత్యులారా, సభికులారా వేగిరమే మరో పరిష్కారము కనుగొనుడు ఈ సభకు ఈ రోజుకు చాలించెదను" చక్రవర్తి సభలోంచి బయటకి వెళ్ళిపోయాడు ★